క్లుప్తంగా

సీఐ మల్లేశ్వరరావు సేవలు అభినందనీయం



సీఐ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్పెషల్ బ్రాంచ్ సీఐగా బదిలీ అయిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎంవీఎస్ మల్లేశ్వర రావుకు స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎలీజా, పట్టణ ప్రముఖులు, అధికారులు సీఐ మల్లేశ్వర్రావు దంపతులను ఘనంగా సత్కరించారు. మూడేళ్ల పాటు తన ఉద్యోగ నిర్వహణలో సహకరించిన సర్కిల్‌లోని ప్రజలకు సీఐ మల్లేశ్వర్రావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, లోక్ అదాలత్ సభ్యులు ఎండీ అక్బర్ అలి, పి.సోమశేఖర్, ఎస్కే ఆజాద్‌బాబు, ఎ అప్పారావు, నాలుగు మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



బిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

కామవరపుకోట: శ్రీ వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాలధారులకు బుధవారం అన్నదానం (భిక్ష) కార్యక్రమం ప్రారంభించారు. ఈనెల 24 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు కామవరపుకోట శ్రీ వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గత ఏడు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో కడిపి పాపారావు, బొల్లు సత్యనారాయణ, మారం రమేష్, వీరమల్ల మధు, కానూరు బద్రి, కానూరు సతీష్, కొండూరు శ్రీధర్, కాకి చంటి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్లు అందజేత



మహిళలకు కళ్లజోళ్లు అందజేస్తున్న పీవీ బ్రదర్స్

ద్వారకాతిరుమల: డాక్టర్ బి.రామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 27న ద్వారకాతిరుమలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అందులో 300 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా, 130 మందికి కళ్లజోళ్ల అవసరమని గుర్తించారు. వారికి బుధవారం పీవీ బ్రదర్స్ హేమంత్, కిరణ్ కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ పాల్గొన్నారు.

సంకల్ప సీనియర్ సెకండరీ స్కూల్‌కి పొంగుటూరు విద్యార్థి



బి.సాగర్

కొయ్యలగూడెం: సంకల్ప సీనియర్ సెకండరీ స్కూల్‌లో పొంగుటూరుకి చెందిన విద్యార్థి బల్లి సాగర్ సీటు సాధించినట్లు పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు బుధవారం పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి చదువుతున్న సాగర్ ఇటీవల శ్రేష్ఠ పరీక్షలో పాల్గొని అత్యున్నత ర్యాంకు సాధించి ఒరిస్సాలోని బరంపురం సంకల్ప సీనియర్ సెకండరీ స్కూల్‌లో సీటు సాధించాడన్నారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

27న చేతివృత్తిదారుల సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల జిల్లా విస్తృత సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆర్ఆర్‌పేటలోని చేతి వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్టు సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కోకన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం నాయకులంతా హాజరు కావాలని కోరారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 కౌంట్ రొయ్యలకు రూ.240 ధర అమలు చేయాలని, చేపలకు మద్దతు ధరలు ప్రకటించి అమలు చేయాలని కోరారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ పేర్కొన్నారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు మేలు

- నియోజకవర్గంలో 920 మంది రైతులకు ఉచితంగా 491 బోర్ల ఏర్పాటు
- 45 విద్యుత్ మోటర్ల పంపిణీ
- సుమారు రూ.11 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతుల కోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకం చిన్న, సన్నకారు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకంలో బోర్లు వేయడమే కాకుండా రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మోటర్లు కూడా అందజేసి విద్యుత్ సరఫరా ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు రైతుల వ్యవసాయం పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతుల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుండడంపై రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

తొలగుతున్న సాగునీటి కష్టాలు

చిన్న, సన్నకారు రైతులు అత్యధికంగా వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండిస్తూ ఉంటారు. ఒకొక్కసారి సాగునీటి కష్టాలను ఎదుర్కొంటూ ఉండేవారు. పంట పొలాలకు బోర్లు వేయాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జలకళ పథకం ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారు. రైతుల భూముల్లో ఉచితంగా బోర్లు వేయించడమే కాకుండా విద్యుత్ సరఫరా కూడా ఇవ్వడంతో రైతులకు సాగునీటి కష్టాలు తొలగుతున్నాయి.

నియోజకవర్గంలో 491 బోర్ల ఏర్పాటు

పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ప్రభుత్వం 920 మంది సన్న, చిన్నకారు రైతులకు సుమారు 491 బోర్లను ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ఈ బోర్లకు సంబంధించి విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసుకున్న రైతులకు 45 విద్యుత్ మోటర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఇందుకోసం సుమారు రూ.11 కోట్ల వరకూ ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు.





వైఎస్సార్ జలకళ పథకంలో రైతులకు పంపిణీ చేసిన విద్యుత్ మోటర్లు

సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి



వైఎస్సార్ జలకళ పథకం ద్వారా సాగునీటి కోసం రైతులకు ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేయించడం జరుగుతుంది. బోర్లు అవసరమైన రైతులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. బోర్లు వేయడంతో పాటు ఉచితంగా విద్యుత్ మోటర్లు కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం



మాకున్న పొలంలో పంట వేసుకుంటే సాగునీటి కష్టాలు ఎదుర్కొనేవాళ్లం. పంటలు వేసిన తర్వాత మా బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి జలకళ పథకం ద్వారా మాకు బోర్లు వేయడంతో పాటు విద్యుత్ మోటర్లను కూడా ఉచితంగా అందజేశారు. దీంతో మాకు సాగునీటి కష్టాలు తొలగాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

మడివి దుర్గారావు, గిరిజన రైతు, అంతర్వేదిగూడెం

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఊరేగింపు వేడుక క్షేత్రంలో బుధవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా ఆలయం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి, పురోహితులు హారతులిచ్చారు. ఆ తరువాత తీన్మార్ డప్పు వాయిద్యాల నడుమ క్షేత్ర పుర వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ప్రతి ఇంటి ముంగిట భక్తులు అమ్మవారికి నీరాజనాలు సమర్పించారు. రాత్రి పంగిడిగూడెం పోలవరం కాలువలో నిమజ్జన వేడుకను నిర్వహించారు.

భారీ అన్నసమారాధన

దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధనను జరిపారు. ముందుగా ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, నివేదన సమర్పించారు. అనంతరం ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు అన్నసమారాధనను ప్రారంభించి, భక్తులకు అమ్మవారి అన్నప్రసాదాన్ని అందజేశారు.

బతుకమ్మల ఊరేగింపు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తుల పూజలందుకున్న కనక దుర్గమ్మ అమ్మవారి ప్రతిమలను జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కాల్వల్లో నిమజ్జనం చేశారు. ములగలంపల్లిలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు గంటసాల గాంధీ ఆధ్వర్యంలో నాయకులు బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ములగలంపల్లి నుంచి వాడపల్లి కాలనీ వరకూ ఊరేగింపు నిర్వహించిన అనంతరం గ్రామ సమీపంలోని కాల్వలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పేరాబత్తుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బి. దుర్గారావు, మరీదు కొండయ్య, పేరాబత్తుల లక్ష్మీనారాయణ, పేరాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో అశ్వవాహనంలో గంగానమ్మకు గ్రామోత్సవం



ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు



బుట్టాయగూడెం: ములగలంపల్లిలో బతుకమ్మల ఊరేగింపు



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఈవో

ఘనంగా గంగానమ్మ గ్రామోత్సవం

జంగారెడ్డిగూడెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శ్రీ గంగానమ్మ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. సుందరంగా అలంకరించిన అశ్వవాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తి ఉంచి పట్టణ ప్రధాన వీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, బాణసంచాలు, వేదమంత్రోచ్చారణ నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో 5 వేల మందికిపై గా పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను మహంకాళి రామ్మోహనరావు మిత్రబృందం రూ.30,600కు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: అంగన్‌వాడీ టీచర్, సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ పీవో పి.ఋ్యాలా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ జంగారెడ్డిగూడెం పట్టణంలోని జంగారెడ్డిగూడెం-7 (ఎస్టీ), సుబ్బంపేట-2 (బీసీ-బి)పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే అంగన్‌వాడీ సహాయకురాలు జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం (జనరల్), జంగారెడ్డిగూడెం-2 (జనరల్), వీరన్నగూడెం (జనరల్ -హియరింగ్ హ్యాండ్ కాఫ్), జంగారెడ్డిగూడెం-9 (ఎస్టీ), తిరుమలాపురం-2 (జనరల్), పట్టెన్నపాలెం -1 (జనరల్-పీహెచ్), కామవరపుకోట మండలం కొండగూడెం-1 (ఎస్సీ), ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం-1 (బీసీ-ఎ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. స్థానికులు, వివాహిత మహిళలై, 35 సంవత్సరాలోపు, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వైకల్యం ఉన్నవారు అతి తక్కువ వైకల్యం ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జంగారెడిగూడెం ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

చింతలపూడి: చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చింతలపూడి ఐసీడీఎస్ పీవో పి.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగపాలెం మండలం దిబ్బగూడెం కేంద్రం (ఎస్సీ), సింహాద్రిపురం కేంద్రం (ఓసీ) అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీ ఉండగా, చింతలపూడి మండలం పోతునూరు(బీసీ-డి), ఎండపల్లి (బీసీ-బి), వడ్డెరగూడెం(ఓసీ), గుర్లపాడు (ఎస్సీ), పానుకుమాడు (బీసీ-డి), టి.నరసాపురం మండలం వీరభద్రవరం-1 (ఓసీ), మర్రిగూడెం (ఓసీ) అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో నవంబర్ 1వ తేదీ లోపు ఐసీడీఎస్ కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కొయ్యలగూడెం: అంగన్‌వాడీ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో యుఎన్ స్వర్ణకుమారి బుధవారం పేర్కొన్నారు. రామానుజపురం-1 (బీసీ బీ), సీతంపేట-1 (ఓపెన్) కేంద్రాలలో హెల్పర్ పోస్టులకు గాను దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులు నేరుగా కొయ్యలగూడెంలోని ఐసీడీఎస్ కార్యాలయానికి అందజేయాలన్నారు.

ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకే 'ఫిష్ ఆంధ్ర'

నిడమర్రు: రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించడంతోపాటు, యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకే రాష్ట్రంతోపాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. బుధవారం నిడమర్రు పందికోడు వంతెన వద్ద ప్రభుత్వ సబ్సిడీతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌ను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ నాణ్యమైన చేపలు, రొయ్యలు వంటి ఆక్వా ఉత్పత్తులను తక్కువ ధరలకే అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లను పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. భారత్ నుంచి ఎగుమతి అయ్యే మత్స్య ఉత్పత్తుల్లో మన రాష్ట్రం నుంచే 40 శాతం మత్స్య ఉత్పత్తులు జరగడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడంతోపాటు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్న ఫిష్ ఆంధ్ర అలాగే పరిశుభ్రత, నాణ్యమైన చేపలను తక్కువ ధరలకే ఈ అవుట్ లెట్స్ ద్వారా అందించేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యం



చింతలపూడి: తిమ్మిరెడ్డిపల్లిలో వృద్ధురాలికి ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: గంగవరంలో ఆరోగ్య సురక్షలో పోషకాహార ప్రదర్శన

చింతలపూడి: పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని తహసీల్దార్ కృష్ణజ్యోతి అన్నారు. మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నిపుణులైన వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ విద్యాసాగర్, సచివాలయ కన్వీనర్ శాంతకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్ వెంకటేశ్వరరావు, కె గోకవరం పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాజవరం పంచాయతీ గంగవరం గ్రామంలో తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచుల ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య, పార్టీ నాయకులు తమ్మిర్చి బ్రహ్మయ్య, మద్దిపాటి సోమేశ్వరరావు, కుర్రు నాగబాబు, బల్లే కేసుబాబు, వూసా దామోదరం, కోడారి రేఖ, వుండి ఆనందరావు, చింత కృష్ణ, ఈడుపుగాంటి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



కొయ్యలగూడెంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

కొయ్యలగూడెం: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పలు గ్రామాల్లో అమ్మవార్ల ఊరేగింపులు, అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. కొయ్యలగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం వద్ద మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అధ్యక్ష ఉపాధ్యక్షులు మంతెన సోమరాజు, చోడిపిండి సుబ్రహ్మణ్యం తదితరులు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు నాలుగు వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. యర్రంపేటలో నెలకొల్పిన కనకదుర్గమ్మవారి విగ్రహాన్ని గ్రామస్తులు ఘనంగా ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు. గంగవరం, రాజవరం, కన్నాపురం, బయ్యనగూడెం గ్రామాలలో దసరా ముగింపు వేడుకలు నిర్వహించారు.

గిరిజన దర్బారులో వినతుల స్వీకరణ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బారులో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ పలు సమస్యలపై వినతిపత్రాలను అందుకున్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నుంచి ప్రజలు సమస్యలపై వినతిపత్రాలను పీఓకు అందజేశారు. వినతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పీఓ చెప్పారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- కలరాయనగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు సంక్షేమం, అభివృద్ధి అందజేయాలని సంకల్పించి నాలుగున్నరేళ్ల పాలనలో నూటికి నూరుశాతం అమలు చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం కలరాయనగూడెం గ్రామంలో బుధవారం 199వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా, స్థానిక సర్పంచ్ చలగుళ్ల రవిబాబు, పార్టీ నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఎమ్మెల్యే ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. వృద్ధులు, చిన్నారులను, మహిళలను ఆప్యాయంగా పలకరించారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎలీజా మాట్లాడుతూ కులమతాలకు, పార్టీ, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్ కె రామకష్ణ, చలగుళ్ల సూరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తాడేపల్లి శాంతరావు, కట్టుబోయిన రమేష్, కొత్తూరి రమేష్, కర్లపూడి ఆనంద్, అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



విజయోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, వైఎస్సార్ సీపీ శ్రేణులు

లింగపాలెం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తి చేసుకోనున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ సభ వాల్ పోస్టర్‌ను చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా బుధవారం ఆవిష్కరించారు. లింగపాలెంలో వైఎస్సార్ సీపీ నేత, మైత్రి డెవలప్పర్స్ అధినేత బీవీఎస్ రెడ్డిచే ఈ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ ఈనెల 28న జంగారెడ్డిగూడెంలో జరిగే విజయోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.